# "మిస్ వరల్డ్"

– డా. దేవరాజు మహారాజు

అది రాజధాని నగరం. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించడానికి పరిశ్రమిస్తున్న నగరం. గత కాలపు ఘనకీర్తిని చారిత్రక కట్టడాలలో ప్రతిబింబిస్తున్న నగరం. ఆ నగరంలో సువిశాలమైన స్టేడియం. అక్కడ ప్రపంచ సుందరీమణుల అందచందాల పోటీలు జరుగుతున్నాయి. అక్కడి ఏర్పాట్ల కోసం కొన్ని కోట్ల కోట్లు ఖర్చయ్యాయని అంటారు. మందుతాగి వచ్చిన మనుషులంతా నిశ్శబ్దంలో పెద్దమనుషులైపోయారు. పెట్రోలు తాగి వచ్చిన వాహనాలన్నీ స్టేడియం ముందు రెక్కలు ముడుచుకుని నిద్రపోతున్నాయి. డబ్బున్న వాళ్లూ, పేరున్న వాళ్లూ అంతా ఒకటేనన్నట్లు స్టేజికి దగ్గరలో వాళ్లంతా ముందు సీట్లలో కూర్చున్నారు. మధ్యతరగతి మందహాసాలన్నీ ఆ వెనక విరబూస్తున్నాయి. ఆ చివరన ఉండాల్సిన అలగా జనం అక్కడ లేరు.

నేపథ్యంలో సన్నగా సంగీతం సాగుతోంది. అనుగుణంగా అందాల రమణులు మెరుపు తీగల్లా స్టేజిపై కదులుతున్నారు.

నిండా కట్టూబొట్టూతో భారతీయ సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తూ కొందరు యువతులు వచ్చి సభకు నమస్కరించి వెళ్లారు. వెనక కూర్చున్న జనమంతా చప్పట్లు చరిచారు. ముందు కూర్చున్న పెద్ద తలలన్నీ ఈసడింపుగా వెనక్కి చూశాయి. 'కల్చర్ తెలియని వెధవలు' అని గొణుక్కున్నాయి. చుడీదార్, షట్ శల్వార్‌లతో మరికొందరు వచ్చి వెళ్లారు. ఈశాన్య ప్రాంతపు చీరెకట్టుతో కొందరు, ఆగ్నేయ ప్రాంతపు పద్ధతిలో కొందరూ వచ్చి వెళ్లారు. ఆ తర్వాత వాయువ్య ప్రాంతాల సంప్రదాయాన్ని ఓ యువతి ప్రతిబింబిస్తే, నైరుతి ప్రాంతాల కళౌన్నత్యాన్ని ఇంకో పడతి ప్రదర్శించింది. ఎవరూ ఎవరికీ తీసిపోని విధంగా సాగుతోంది ప్రదర్శన. ఇందులో ఎవరు అతిలోక సుందరిగా ఎన్నికవుతారు? అసలు ఎన్నిక ఎలా చేస్తారు.

ముఖ వర్చస్సును బట్టా, ఒడ్డూ పొడుగును బట్టా, 36-24-36 కొలతలను బట్టా? చర్మపు నునుపును బట్టా? ఛాయను బట్టా? స్టేజి మీద కాకుండా తెర వెనుక చూపే అందాలింకేమైనా ఉన్నాయా?

ప్రేక్షకుల్లో అనుమానం, అయోమయం, ఉత్సుకత, ఉత్కంఠ!

సమాజానికి సంక్షిప్త రూపం ఆడిటోరియంలోని ప్రేక్షకుల సమూహం.

ఆ సంరంభాన్ని బయటి ప్రపంచానికి తెలియజెప్పాలని వచ్చిన పత్రికా విలేకరులు. ఫొటోగ్రాఫర్లు, టెలివిజన్ వార్తా విభాగాలు, సాంస్కృతిక ప్రతినిధులు, అధికారులు... కట్టుదిట్టాల ప్రభుత్వ యంత్రాంగం అంతా సజావుగా ఉంది.

పోరుబాటలో నడిచి తన చివరి రక్తపు బొట్టు సైతం సమాజానికి అర్పించిన కామ్రేడ్ శ్రీమతి సుందరమ్మ జ్ఞాపకార్థం కట్టిన కళాక్షేత్రం అది. అక్కడ సుందరీమణుల అందాల పోటీలు జరుగుతున్నాయి. సిద్ధాంతాలు ఎగిరిపోయాయో, త్యాగాలు ఇగిరిపోయాయో, డబ్బుకు, హోదాకు, కీర్తి దాహానికి అడ్డదారులు ఎక్కువయ్యాయో... తెలియదు. తాము ఆకాశంలో సగమంటూ అరచి గీపెట్టే ఫెమినిస్టుల గొంతుకలు కూడా అక్కడ వినబడలేదు.

నేపథ్య సంగీతం సాగుతోంది. అయితే ట్యూన్ మారింది. లైట్ల రంగులు మారాయి. మిడ్డీలు, స్కర్ట్‌లతో సుందరీమణులంతా స్టేజి మీద బంతుల్లా దూకుతున్నారు.

అర్ధనగ్న ప్రదర్శన ఆహ్లాదంగా

తయారవుతోంది. ఒకరి తర్వాత ఒకరు, ఒకరి వెనక ఒకరు, ఒకరి పక్కన ఒకరు అందచందాలు ప్రదర్శిస్తున్నారు. ప్రతి అంగాన్నీ సున్నితంగా, సుతారంగా కదుపుతున్నారు.

ఆ తర్వాత మరికొంతమంది యువతులు స్టేజిపైకి వచ్చారు. వాళ్లు జిగేల్‌మనే కట్ డ్రాయర్లతో, తళుక్కుమనే బ్రాలతో కొంగల్లా నడుస్తూ వచ్చారు. పైకి మడిచి ముడి వేసుకున్న జుత్తు కొందరిదైతే, క్రాపు చేయించుకున్న జుత్తు కొందరిది. నాజూకుగా వున్న వారి కొద్దిపాటి ఆభరణాలు పెట్టినట్టుగా లేవు. ఒంట్లో పుట్టినట్టుగా ఉన్నాయి.

లైట్ల రంగులు మారిపోతున్నాయి. నేపథ్య సంగీతం మారిపోతోంది. పోటీలో పాల్గొన్న సుందరీమణుల నడక వేగం, శైలీ విరుపూ మారిపోతోంది. జట్టుగా వచ్చిన వాళ్లు గుండ్రంగా తిరిగి విడిపోతున్నారు. విడిపోయిన వారు నాట్య భంగిమలో అడుగులేసి మరోసారి జట్టుగా తయారవుతున్నారు.

అదొక సౌందర్య విన్యాసం!

అదొక విలాసాల వినోదం!!

భుజం మీది నుండి, వక్షోజాలపై నుండి అడ్డంగా జారిపడిన వెడల్పాటి మెరుపు రిబ్బను వారు ఏ ప్రాంతపు అందగత్తెలో తెలుపుతున్నాయి. వారక్కడ వ్యక్తులు కారు. ఈ భూమి మీద ఒక ప్రాంతానికి ప్రతినిధులు! వేల వేల యేళ్ల నాటి సాంస్కృతిక వైభవానికి ప్రతీకలు!!

అందాల ప్రతినిధులు!

వారసత్వపు ఔన్నత్యాన్ని నిలిపే ప్రతిజ్ఞలు!!

ఒక్కసారిగా లైట్లన్నీ ఆరిపోయాయి. నేపథ్య సంగీతం మూగబోయింది. ఆడిటోరియంలో అంధకారం చలాయించింది. అయితే అది ఒక్క నిముషం.

పొడి దగ్గులు, పిల్లల ఏడ్పులు, ప్రేక్షకుల్లో అసహనపు కదలికలు, కుర్చీ విరుపులు, రెక్జిన్ పరపరలు- అయితే అది ఒకే ఒక్క నిముషం కొనసాగింది.

మళ్లీ మ్యూజిక్ మొదలయింది. స్టేజి మీద నీలి దీపాలు కళ్లు తెరిచాయి. హాల్లో చిన్ని దీపాలు చిట్లించుకుని చూశాయి. అందమైన సాయంత్రం అందాలు ఒలకబోస్తున్నట్లు హాల్లో ఎ.సి. చలిగాడ్పుల మధ్య ప్రేక్షకుల ఊపిరిలో ఆహ్లాదం పెరిగింది. దాన్ని తామొక్కరే ఆస్వాదిస్తున్నట్లు ఎవరికి వారే అనుభూతి చెందుతున్నారు. 'మిస్ వరల్డ్' కిరీటం ఎవరికోనని- అందరిలో ఆత్రుత పెరుగుతోంది. న్యాయ నిర్ణేతలే కాదు. ప్రేక్షకుల్లో ప్రతి ఒక్కరూ తామే న్యాయ నిర్ణేతలైనట్లు మనసులోనే తీర్పు ఇచ్చుకుంటున్నారు.

స్టేజి మీద రమణులు రమణీయంగా కదులుతున్నారు. వాళ్ల మధ్యలో ఒక యువతి మరీ ప్రత్యేకంగా కదులుతోంది. అంతా కళ్లు చిట్లించుకుని చూశారు. ఊపిరి బిగబట్టి చూశారు. మెదడు మొద్దుబారిపోగా తేరుకుని చూశారు. వెంట్రుకలు నిక్కబొడుచుకోగా అది సాధ్యమేనా- అని చూశారు.

నల్లటి గచ్చు మీద, తెల్లటి ఆమె నగ్న శరీరం దీపపు ప్రతిబింబంగా మెరుస్తూ సాగింది.

ఆమెకు ఏ ఆచ్ఛాదనలూ లేవు. ఏ ఆభరణాలూ లేవు.

ఒంటి మీద నూలుపోగు లేదు- సిల్కో పాలిస్టరో లేదు.

అలాగని ఏ సింథటిక్ ఫాబ్రిక్కూ లేదు. 'బర్త్ డ్రస్'లో ఉంది.

ముందు సీట్లలోని ముఖ్యమైన మనుషులు చొంగ కార్చుకున్నారు. ఈలలు వేశారు. లేచి గెంతారు. వెనక సీట్లలోని అమాయకులు అది కలా, నిజమా అని అయోమయంలో పడ్డారు. వాళ్లకెందుకో, ఏమిటో భయం...! చప్పట్లు చరచడానికి జడిశారు. లోగడ తాము చప్పట్లు చరిస్తేనే గుడ్లురిమిన వాళ్లు ఇప్పుడు చెంగుచెంగున గెంతడం వాళ్లకు చిత్రంగా తోచింది.

పోటీ ముగిసింది. న్యాయ నిర్ణేతల సంఘంతో చర్చించి 'మనిషి' ఫలితాలు ప్రకటిస్తాడని మైక్‌లో ప్రకటన వెలువడింది-

కొద్దిసేపు న్యాయనిర్ణేతలలో తర్జన భర్జన జరిగినట్టుంది. ఆ తర్వాత కాసేపటికి స్పాట్ లైట్ 'మనిషి' మీద పడింది. 'మనిషి' నడుస్తున్నంతసేపు అది అతని మీదే ఉంది. అతడు స్టేజీ మీదికి చేరి సభికుల వైపు నవ్వుతూ చేయి ఊపాడు. అది హాల్లోని ప్రేక్షకులకు మాత్రమే కాదు, ప్రపంచం నలుమూలలా టి.వి. సెట్ల ముందు కూర్చుని లైవ్ టెలికాస్ట్ చూస్తున్న కోటానుకోట్ల ప్రేక్షకులకు కూడా




అని అతనికి తెలుసు. 'మనిషి' తీర్పు వెలువడబోతోంది.

'మనిషి' ఒక నిముషం మిస్ వరల్డ్ పోటీలో ఎన్ని ప్రాంతాలవారు, ఎంతమంది పాల్గొన్నారన్న వివరాలు ఇచ్చాడు. నిండుగా గుడ్డలు కట్టుకున్న అమ్మాయికి తృతీయ స్థానం. అర్ధనగ్నంగా వున్న అమ్మాయికి ద్వితీయ స్థానం. పూర్తి నగ్నంగా వున్న అమ్మాయికి ప్రథమ స్థానం ఇచ్చినట్లు ప్రకటించాడు. హర్షధ్వానాలు మిన్నుముట్టాయి. బాణాసంచా ఆకాశంలో వెలిగింది.

'మనిషి' ముగ్గురికీ మూడు కిరీటాలు అమర్చాడు. ఆ సందర్భంలో వారి స్పందన ఏమిటని? ముగ్గురినీ ఒకే ప్రశ్న అడిగాడు. ముగ్గురు మూడు విధాలుగా సమాధానం చెప్పారు.

"నాకు మూడో స్థానం ఇచ్చినందుకు సిగ్గుపడడం లేదు. నేను మనిషిగా పుట్టినందుకు సంప్రదాయాన్ని వదులుకోకుండానే నాగరికంగా మసలుకోవడం నా ధ్యేయం" అని చెప్పింది– మూడో స్థానానికి ఎన్నికైన అమ్మాయి... కొంగు సవరించుకుంటూ.

"సంప్రదాయంలో కూరుకుపోకుండా ఆధునికతను ఆహ్వానించిన నాకు రెండో స్థానమైనా దక్కినందుకు సంతోషంగానే ఉంది"– అని చెప్పింది రెండో స్థానానికి ఎన్నికైన అమ్మాయి... బ్రా స్ట్రాప్స్ సాగదీసి వదిలేస్తూ.

"ఆధునికులమనుకునే వారిని సైతం దాటివేసి, అత్యాధునికతను ప్రదర్శించిన నాకు మొదటి స్థానం రావాలని ఆశించాను... అలాగే వచ్చింది"– ముసిముసి నవ్వులతో మురిపిస్తూ నగ్నంగా సెలవిచ్చింది మిస్ వరల్డ్ గౌరవం దక్కించుకున్న నగ్న సుందరి.

"స్వచ్ఛతకు, నిజాయితీకి నా నగ్నత్వం ప్రతీక. ఈ కల్లాకపటాల ఆచ్ఛాదనలు మనిషి పుట్టినపుడు లేవు, చచ్చినపుడు లేవు. బహుశా నాలోని నిబ్బరానికీ, నిర్భయానికీ ఈ గౌరవం లభించింది." ఆమె ఆనందాతిశయంలో తేలిపోతూ చెప్పింది, కప్పుకోవాల్సింది ఏమీ లేదు గనక చేతులు స్వేచ్ఛగా గాల్లో ఆడిస్తూ.

ఆమె తాత్విక చింతనను, ఆధ్యాత్మిక ఉన్నతిని 'మనిషి' ఎంతగానో ప్రశంసించాడు. గొప్ప ఎన్నిక చేసినందుకు అందరూ 'మనిషి'ని అభినందించారు.

# శుభాకాంక్షలు

'పత్రిక' ద్వితీయ సంచిక కూడా తొలి సంచిక రీతిలోనే అందరి ఆదరాభిమానాలను చూరగొన్నది. పెద్ద సైజులో 'పత్రిక' వస్తే బాగుండునన్న కోరికను కొందరు వ్యక్తం చేసినా– small is beautiful అన్న నానుడినే అధికులు ఆమోదించారు. సైజు చిన్నదయినా 80 పేజీలతో, కథలు, కవితలతో పత్రిక 'ఘనం'గానే వెలువడిందని ప్రస్తుతించారు. అందరూ ఆశ్చర్యపడేది– ఇన్ని పేజీలతో, ఇంత ముచ్చటయిన ముద్రణతో– అయిదు రూపాయలకే పత్రికను ఎలా ఇవ్వగలుగుతున్నారని? ఎంతకాలం ఇలా ఇవ్వగలరని?

నిజమే– పత్రిక ముద్రణ ఖర్చుతో – ఏమాత్రం పొంతన లేని విక్రయ ధరతో – పత్రికను నడపడం అంత సులభ సాధ్యమేమీ కాదు. మామూలుగానే పత్రికను నడపడం యజ్ఞం కింద లెక్క. అలాంటిది లాభనష్టాల బేరీజు లేకుండా పత్రికను ప్రశంసనీయంగా నెలనెలా తేగలగడం ఎంతో వ్యయప్రయాసలతో కూడిన పని. అయినా అనేక కష్టనష్టాలకోర్చి సహృదయులు అయిన ప్రకటనకర్తల తోడ్పాటును వీలయినంత సమీకరించుకుని– పత్రికను ఇదే రీతిలో హుందాగా తేవాలన్నదే మా సంకల్పం. ఇందుకు పాఠకులు, అభిమానుల తోడ్పాటుతోపాటు రచయితల సహకారం ఎంతో అవసరం. అడిగిన వెంటనే కాకపోయినా మనసు స్పందించి వ్రాసిన రచన– అది కవిత కానీ, కథ కానీ, సాహితీ సమీక్ష కానీ ఏదయినా సరే, పంపి– పత్రిక ప్రతినెలా ప్రామాణికంగా పాఠకులు, సాహితీపరులు మెచ్చే విధంగా వెలువడడానికి సహకరించగలరని ఆశిస్తున్నాం. నూతన సంవత్సరంలో ప్రథమ సంచిక అయిన జనవరి సంచికకు – పలువురు పాఠకులు ఉత్తరాల ద్వారా చేసిన సూచనల మేరకు మరింతగా సాహితీ పరిమళాలు అద్దే ప్రయత్నం చేశాం. తొలి సంచికకు ఒకింత భిన్నంగా ఈసారి– కథలు, కవితలకు తోడు సందర్భోచితమని భావించిన కొందరు ప్రసిద్ధ సాహితీవేత్తల జీవిత విశేషాలను, వారి సాహితీ ప్రశస్తిని వ్యాసాలు, ఇంటర్వ్యూల రూపంలో ప్రచురించాం. కథలు, కవితల విభాగంలో సయితం ఈసారి కొన్ని కొత్త కలాలు వుండడం గమనించగలరు. అన్ని సాహిత్య ప్రక్రియల విశాల వేదికగా, సమాచార సంచయంగా పత్రికను రూపొందించే కృషి కొనసాగడానికి అందరి సహకారాన్ని మరోసారి అర్థిస్తున్నాం. పాఠకులు, రచయితలు, ప్రకటనకర్తలు, పత్రికాభిమానులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.

**–ఎడిటర్**

నిజమే తన నిర్ణయం సరైనదేనని తనకు తానే వెన్ను చరుచుకున్నాడు– 'మనిషి'. అందరూ లేచి ఎవరి దారిన వారు వెళ్లిపోతున్నారు.

'మనిషి'– ఆడిటోరియంలోంచి బయటికి వచ్చాడు.

రోడ్డు మీద గాడిద కనిపించింది. దానికి ఏ ఆచ్ఛాదనలూ లేవు. మరికొంత దూరంలో చెత్తకుండీల చుట్టూ పందులు తిరుగుతూ కనిపించాయి. వాటి నిబ్బరానికి, నిర్భయానికి సలామ్‌లు చేయాలి. కొట్లాడుకుంటున్న కుక్కలకూ అంతే!

'మనిషి' ఆలోచనలో పడ్డాడు.

తన నిర్ణయంలో ఏదైనా లోపం జరిగిందా? తాను ప్రోత్సహించింది మానవ సంస్కృతినా, జంతు సంస్కృతినా? తక్కువ బట్టలతో, అసలు బట్టల్లేకుండా తిరగడమే నాగరికత అయితే, జంతువుల నాగరికత ఎంతో గొప్పది కదా! మిస్ వరల్డ్ పోటీలో మిస్సయిందేమిటి?

'మనిషి' జీవితంలో దేన్నో అన్వేషిస్తూ, దేనికోసమో బతుకుతూనే ఉన్నాడు.

○